క్లుప్తంగా

చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు పాటించాలి



మల్కాపూర్ చెరువు వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): చెరువులు, కుంటల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ చెరువు వద్ద ప్రజలకు, రైతులకు ప్రమాదాలు జరుగకుండా అవగాహన కల్పించారు. చెరువులో దుస్తులు ఉతకడం, ఈత కొట్టడం, చెరువులో చేపలు పట్టేందుకు విద్యుత్ వైర్లు వేయ్యదన్నారు. చిన్నారులను చెరువుల వద్దకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి ఈత కొట్టవదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ.శంకర్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, గ్రామస్తులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను అభినందిస్తున్న రాజిరెడ్డి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో శనివారం మండల స్థాయి సీసీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పట్టణానికి చెందిన పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరంజ్యోతి, పలు యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నాగవెల్లి



నాగవెల్లి నిర్వహిస్తున్న ఒగ్గు కళాకారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం నాగవెల్లి నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు పాటలతో నాగవెల్లి నిర్వహించగా, మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ రామగౌడ్, నాయకులు అంజాగౌడ్, కిషన్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్‌తో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిజాంపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట విద్యుత్ శాఖ లైన్‌మెన్ రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో శనివారం వినియోగదారుల వివరాలను నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 200 యూనిట్లు ఉచిత కరెంట్ పొందాలంటే వినియోగదారులు ప్రజా పాలనకు సంబంధించి అప్లికేషన్ ఫామ్‌తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్లను సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ మునిరాజ్, సిబ్బంది శివ, రఘు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌కు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న చేగుంట లయన్స్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలో లయన్స్ క్లబ్ అందించిన సేవా కార్యక్రమాలకు 11 అవార్డులు అందుకున్నట్లు అధ్యక్షుడు అనీల్ తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణంలో లయన్స్ ఇంటర్నేషనల్ 320డీ అవార్డులు అందజేశారు. ఉత్తమ సేవలు నిర్వహించిన లింగమూర్తి, సురేందర్, అనీల్, బుర్క నాగరాజులకు సేవ అవార్డులతో పాటు మరో 7 అవార్డులను చేగుంట లయన్స్ క్లబ్ సొంతం చేసుకుంది. ఈ అవార్డులు లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబూరావు, రీజియన్ చైర్‌పర్సన్ రాధాకృష్ణ అందజేశారని తెలిపారు.

కారు, బైక్ ఢీ:
ఇద్దరికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని టీ.మాందాపూర్ శివారులో శనివారం జరిగింది. టీ.మాందాపూర్‌కు చెందిన ఇద్దరు బైక్‌పై మెదక్ వైపు వెళ్తున్న క్రమంలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రాజుతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వారిని 108లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీస్‌లకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.



కొల్చారం(నర్సాపూర్): చిత్రలేఖన పోటీలో విద్యార్థులు



వెల్దుర్తి(తూప్రాన్): ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



చిలప్‌చెడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



పాపన్నపేట(మెదక్): విజేతలకు బహుమతులు అందజేస్తున్న నోడల్ అధికారి, హెచ్‌ఎం మహేశ్వర్

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్ పోటీలు ఘనంగా నిర్వహించినట్లు నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ చిత్రలేఖనం, కవితలు, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. డ్రాయింగ్‌లో భార్గవి, పద్య పోటీలో వందన, పాటల పోటీలో రీచల్, ఉపన్యాస పోటీలో షాహెద్ అఫ్రిది విజేతలుగా నిలిచారన్నారు. ఈనెల 12న మెదక్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, టీచర్లు సాయికుమార్, రవీందర్ రెడ్డి, అశోక్ కుమార్, నర్సింలు, పద్మ, ప్రవీణ్, నరేందర్, తులసీరాం, బాలరాజు,శ శివకుమార్, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తేనే వారిలోని ప్రతిభ వెలికివస్తుందని మండల నోడల్ అధికారి విఠల్ అన్నారు. శనివారం మండల కేంద్రం చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉపన్యాస, పద్యకవిత, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో కూడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వేదశ్రీ, తారాసింగ్, కృష్ణ, హరిసింగ్, నాగరాజులు, ఉపాధ్యాయులు రమేశ్, చందర్, శ్యామ్, రతన్, కృష్ణమూర్తి, ఇందూరాణి, కీర్తి పాల్గొన్నారు.



నిజాంపేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సైన్స్ విజ్ఞానంతో మేధావులుగా ఎదగాలి

కొల్చారం(నర్సాపూర్): మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులు వైజ్ఞానిక వైఖరిని అలవర్చుకొని, సామాజిక దక్పథంతో మేధావులుగా ఎదగాలని మండల విద్యాధికారి నీలకంఠం సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి జాతీయ, వైజ్ఞానిక సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నీలకంఠం మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, నోడల్ అధికారి సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం మాసాయిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండల నోడల్ అధికారి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో చిత్రలేఖనం, కవిత్వం పాటలు, ఉపన్యాసం వంటి పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటరమణ, నాగరాజు, ఉపాధ్యాయులు రంగారెడ్డి, సాయిబాబ, కవిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, పాటల పోటీలు, చిత్రలేఖనం, కవిత్వం లాంటి పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎస్ యాదగిరి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహేందర్, కల్వకుంట ఉపాధ్యాయులు రవీందర్, న్యాయ నిర్ణేతలు మోహన్, ఉమామహేశ్వర్, వెంకటేశ్, ప్రవీణ్ కుమార్, తిరుపతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



గాయపడిన లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం కర్నాల్‌పల్లికి వచ్చిన దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి దౌల్తాబాద్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. రోడ్డు పనులు వేగంగా నిర్వహించి, త్వరగా పూర్తి చేసేలా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోల్ల లక్ష్మణ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేగుంట మండలంలోని పలు గ్రామాల్లోని అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవను చూపిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రామాగౌడ్, సహకార సంఘం చైర్మన కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ తానీషాతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కరాటేతో బాలికలకు స్వీయ రక్షణ



బెల్టులు సాధించిన విద్యార్థులతో జిల్లా అధికారి, మాస్టర్స్, ఉపాధ్యాయులు

జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు

కొల్చారం(నర్సాపూర్): ఆపద సమయంలో తనను తాను రక్షించుకోవడానికి కరాటే ఆయుధంగా పనిచేస్తుందని, బాలికలు కరాటే నేర్చుకోవడం ద్వారా వారి స్వీయ రక్షణకు తోడ్పడుతుందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెదక్ జిల్లాస్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ ఎగ్జామ్‌కు కొల్చారం, కౌడిపల్లి మండలాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అధికారి నాగరాజు ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటేను ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలన్నారు. కరాటేతో మానసికంగా, శారీరకంగా దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ఎస్జీఎఫ్, యూనివర్సిటీ, ఆసియా, ఒలంపిక్ క్రీడల్లో కరాటేను ప్రవేశ పెట్టామన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రోగ్రాంలో భాగంగా 173 ప్రభుత్వ పాఠశాలల్లోని అమ్మాయిలకు మూడు నెలల పాటు కరాటేలో శిక్షణను ఇస్తున్నామన్నారు. ఈ ఎగ్జామ్‌కు చీఫ్ ఎగ్జామినర్‌గా రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు, కరాటే సీనియర్ మాస్టర్ నగేష్, అబ్జర్వర్స్‌గా దినకర్, గణేశ్, భూపాల్ వ్యవహరించారు. మాస్టర్ మల్లేశం, పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రమీల, భాగ్య లక్ష్మి, అరుణ, శ్రీలత, ఉమా మహేశ్వరీ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో మురికి కాల్వను పరిశీలిస్తున్న అధికారులు



మనోహరాబాద్(తూప్రాన్): చెట్లగౌరారంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యాదగిరిరెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ యాదగిరిరెడ్డి ఆదేశించారు. మండలంలోని చెట్ల గౌరారం, కూచారం, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించేలా కృషి చేయాలని సూచించారు. శానిటేషన్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకొని వారం రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా పనులు జరిపిస్తున్నామని ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం చిలప్‌చెడ్ మండల గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రత్యేక పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనులను పరిశీలించారు. ఈ నెల 15 వరకు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మెదక్ కలెక్టరేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు జిల్లా కార్యదర్శి బి. బస్వరాజు తెలిపారు. శనివారం మెదక్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం, నాయకులు సత్యం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్‌రూరల్: పీఆర్టీయూటీఎస్ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నర్సాపూర్ చిల్డ్రన్స్ పార్క్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్టీయూటీఎస్ సంఘం విశేష కృషి చేస్తుందని, పీఆర్సీ, సీపీఎస్ ఉద్యోగుల ఫ్యామిలీ పెన్షన్ ఇప్పించిన ఘనత ఈ సంఘానిది అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై సమీక్షించి బదిలీలు పదోన్నతులు షెడ్యూలు ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సామ్యా నాయక్, ఎల్కే చందర్, కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు స్వరూపరాణి, రాష్ట్ర కార్యదర్శులు వీరేశం, లాలు, ధన్సింగ్, చెన్న, జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, వెంకటస్వామి, బ్రహ్మచారి, రవీందర్, రామన్న, మండల బాధ్యులు రాజు, బీమ్లా, పంతులు ఇంతియాజ్, జహంగీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నర్సాపూర్: ప్రణాళికతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ అన్నారు. శనివారం కాలేజీలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులను నగదు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. సమావేశంలో కాలేజీ లెక్చరర్లు జ్యోత్స్నదేవి, నాగరాజు, ప్రణీల్, రాజేశ్వర్, కళింగరెడ్డి, రమాదేవి, ఫాతిమా, మాధవి, శ్రీహరి, నాజిమా, అమీనా తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవంలో విద్యార్థులు నృత్యం చేశారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు..

సబ్బండ వర్గాలకు మేలు



చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు రూ.53వేల కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించడం ద్వారా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్దన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలకు మేలు జరిగేలా బడ్జెట్ రూపకల్పన చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

– గోవర్ధన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

అందరికీ ఆమోదం



మెదక్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్ ప్రవేశపెట్టారు. వ్యవసాయానికి నీటి పారుదల రంగానికి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం కోసం, విద్యా, వైద్య వివిధ రంగాల్లో సమాంతరంగా బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా నిరూపించుకుంది.

– నరేందర్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు

కార్మికులను విస్మరించారు

మెదక్: సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో కార్మికశాఖ సంక్షేమానికి పైసా కేటాయించక పోవటం బాధాకరం. బడ్జెట్ అంతా ఆరు గ్యారంటీల చుట్టే తిరిగింది. వాటితోనే ప్రజల జీవనం గడిచిపోదన్న విషయానని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలి. విద్యా, వైద్య రంగానికి ఆశించిన స్థాయిలో కేటాంపులు చేయక పోవడం విచారకరం. రైతులకు రుణమాఫిపై స్పష్టత ఇవ్వడం లేదు.

– మల్లేశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

అంగన్‌వాడీ సరుకుల తరలింపుపై గొడవ



తండాలో విచారణ చేస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రెడ్యా పంచాయతీ పరిధిలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రం సరుకులు బైక్‌పై తరలిస్తుండగా అడ్డుకోవడంతో శనివారం గొడవ చోటు చేసుకుంది. అంగన్‌వాడీ టీచర్ రేణుక భర్త మోతిలాల్ బైక్‌పై సరుకులను తీసుకెళ్తుండగా తండా వాసి ఆంజనేయులు అడ్డుకున్నారు. కేంద్రం వచ్చిన సరుకులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. ఈ విషయమై ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కాగా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష, ప్రత్యేక అధికారి వసుమతి తండాలో విచారణ చేశారు. రెడ్యా తండాలో ఉన్న అంగన్‌వాడీ భవనం తలుపులు బాగా లేకపోవడంతో ఇక్కడే నివాసం ఉంటున్న అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో సరుకులు నిల్వ ఉంచడం గుర్తించారు. ఇక్కడి నుంచి కేంద్రానికి సరుకులు తరలిస్తుండటాన్ని సైతం తెలుసుకున్నారు. సరుకులను అంగన్‌వాడీ భవనం పక్కనున్న పాఠశాలలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆపై రికార్డులను పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిందితులను కఠినంగా శిక్షించాలి**

నర్సాపూర్: దళిత మహిళను వివస్త్రను చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని హోలియదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో దళిత మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు.

◆ **బెల్ట్ షాపులపై పోలీసుల దాడి**

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న రెండు బెల్ట్ దుకాణాలపై శనివారం రాత్రి దాడి చేసిన పోలీసులు పెద్ద ఎత్తున మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు రెండు దుకాణాల్లో 150 బీర్ సీసాలతో పాటు సుమారు 200 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

◆ **కారు–ఆర్టీసీ బస్సు ఢీ, ఒకరికి గాయాలు**

హవేళిఘణాపూర్(మెదక్): అతివేగంగా వస్తున్న బస్సు – కారును ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని శాలిపేట గేటు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. మెదక్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు కారులో చీనూరు – వాడికి విధులు నిర్వహించేందుకు కారులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న రమణికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమైంది. అందులో ఉన్న మిగతా ఉపాధ్యాయులు ప్రాణాలతో బయటపడ్డారు.

నేడు పాపన్నపేటలో బీజేపీ సమావేశం

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంన పాపన్నపేటలో ఆదివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బీకొండ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఔర్ ఎక్‌బార్ మోదీ సర్కార్ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు.

◆ **దాతల సహకారం గొప్పది**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో నిర్మించిన భగలాముఖీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం గొప్ప విషయమని భగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అన్నారు. శివ్వంపేట గ్రామానికి చెందిన పూదండపూరం అశ్వినిగౌడ్ మంచి ఉద్యోగం సాధించడంతో దివంగతులైన వారి తాత సత్తగౌడ్, నాయనమ్మ రాజమణి, తండ్రి శంకర్‌గౌడ్‌ల జ్ఞాపకార్థ రూ.10 లక్షల నిధులతో ఆలయం వద్ద ముఖద్వారం నిర్మాణానికి ముందుకు వచ్చారు. అందుకు సంబంధించి పనులకు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అశ్విని గౌడ్ కుటుంబ సభ్యులు పద్మ, ప్రకాష్‌గౌడ్, భాగ్యలక్ష్మి, రాజేశ్, గ్రామస్తులు హరిశంకర్‌గౌడ్, కిషన్ తదితరులు ఉన్నారు.

◆ **వైద్యపరీక్షల పరిశీలన**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌గేట్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ పరిశీలించారు. శనివారం వైద్యసిబ్బంది రాజమణి, మజీదాబేగం తండాలోని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీంతోపాటు అవసరం ఉన్నవారికి రోగ నిరోధక టీకాలు వేశారు. అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

◆ **చాకరిమెట్లలో భక్తుల పూజలు**

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ది చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

◆ **ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 62 మంది హాజరు**

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు శనివారం 62 మంది హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సమయాల్లో జనరల్, ఒకేషనల్‌లో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. ఇందులో మొత్తం 62 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అందరూ హాజరైనట్లు ఇంటర్ పరీక్షల నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు.